సాక్షి
చిత్తూరు
సోమవారం : 1 : సెప్టెంబర్ : 2025


విద్యుత్ కాంతులీనుతున్న కట్టమంచి చెరువు
(ఇన్‌సెట్) క్రేన్ సహాయంతో వినాయకుడిని నిమజ్జనం చేస్తూ..

'గణ' వీడ్కోలు

జిల్లాలో అయిదు రోజులుగా పూజలందుకున్న గణనాథుడికి భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. చిత్తూరు, పలమనేరు, కుప్పం, పుంగనూరు, పూతలపట్టు, జీడీనెల్లూరు, నగరి నియోజకవర్గాల్లో రాత్రి పొద్దుపోయే వరకూ శోభాయమానంగా సాగిన ఊరేగింపు అనంతరం స్థానిక చెరువులో వినాయక ప్రతిమలను నిమజ్జనం చేశారు. నృత్యాలు చేస్తూ గణనాథుడిని ఊరేగింపుగా తీసుకొచ్చి నిమజ్జనం చేశారు.

- అట్టహాసంగా నిమజ్జన వేడుకలు
- కనులపండువగా ఊరేగింపులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఆదివారం గణనాథుడి నిమజ్జన వేడుకలు అట్టహాసంగా సాగాయి. చవితిని పురస్కరించుకుని పలు ప్రాంతాల్లో వినాయకుడిని కొలువుదీర్చారు. అయిదు రోజుల పాటు భక్తుల చేత విశేష పూజలు అందుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు కూడా అన్ని ప్రాంతాల్లో జలాధి పూజలు అంబరాన్నంటాయి. ఇంటింటా పూజలు అందుకున్నారు. ఊరేగింపుగా వస్తున్న స్వామి వారికి భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు, పసుపు పళ్లెం పట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

కట్ట మంచి చెరువులో నిమజ్జన కోలాహలం

కట్టమంచి చెరువు వద్ద నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా జరిగాయి. భారీ విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు క్రేన్‌లను అందుబాటులో ఉంచారు. నిమజ్జనం చేసేందుకు వచ్చిన భక్తులు చివరి పూజలు చేసి బై..బై గణేశా అంటూ స్వామి వారిని నిమజ్జనం చేశారు. రద్దీని కట్టడి చేసేందుకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు. ఉదయం నుంచి నగరపాలక సంస్థ అధికారులు, పోలీసులు ఆ ప్రాంతంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిమజ్జన కార్యక్రమం పూర్తి చేసేలా చూశారు.


కట్ట మంచి చెరువు వద్ద వినాయకుడి నిమజ్జనం చేసేందుకు వచ్చిన అపోలో కళాశాల విద్యార్థులు






చిత్తూరు : గిరింపేటలో ఊరేగుతున్న భారీ వినాయకుడు, మిట్టూరులో ఊరేగింపు, చెరువులో నిమజ్జనం చేస్తున్న యువకులు, పుంగనూరు : నానబాలమునెమ్మ వీధిలో గుజరాతీలు వినాయకుడి ఊరేగింపు..పాలసముద్రం : నిమజ్జన ఊరేగింపు

శేషవాహనంపై 'విఘ్న' విహారం


అలంకరణలో ఉత్సవ మూర్తి

కాణిపాకం : వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి స్వర్ణ చిన్న, పెద్ద శేషవాహన సేవల్లో విహరించారు. వాహన సేవల్లో విహరించిన విఘ్నేశ్వరుడుని అశేష భక్తజనం దర్శించి పునీతులయ్యారు. స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం సిద్ధి, బుద్ధి, సమేత వరసిద్ధి వినాయకస్వామి స్వర్ణ చిన్న, పెద్ద శేష వాహనంపై అభయమిచ్చారు. అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత గౌరీ సుతుడికి విశేషాలంకరణ చేసి చిన్న శేష వాహనంలో కొలువుదీర్చారు. మేళతాళాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ పురవీధుల్లో వేడుకగా ఊరేగించారు.


అధిక సంఖ్యలో హాజరైన భక్తులు

రాత్రి స్వర్ణ పెద్ద వాహనంలో కనువిందు

ఉభయకర్తలు, ఆలయ అధికారులు ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వర్ణ పెద్ద శేష వాహనంలో కొలువుదీర్చారు. కోలాటాలు, చెక్క భజనల నడుమ పెద్ద శేష వాహన సేవ చేపట్టారు. కమ్మ సామాజిక వర్గీయులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.


చిన్న వాహనంపై ఊరేగుతున్న వరసిద్ధుడు

నేడు చిలుక, వృషభ వాహన సేవ

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సోమవారం చిలుక, వృషభ వాహన సేవల్లో స్వామి వారు దర్శనమివ్వనున్నారని ఆలయ ఈవో పెంచలకిషోర్ తెలిపారు. ఉదయం చిలుక వాహన సేవ, రాత్రి వృషభ వాహన సేవ ఉంటుందన్నారు. ఈ సేవకు ఉభయదారులుగా కాణిపాకం ఆర్యవైశ్యులు, కాణిపాకం, సంతపల్లె, మారేడుపల్లి, ముదిగోళం, చిత్తూరు, శాలివాహన వంశస్థులు వ్యవహరిస్తారని ఆయన పేర్కొన్నారు.

ఫొటోలు తీయొద్దంటూ మీడియాపై ఆంక్షలు

- నిమజ్జన వేడుకలో విలేకరులపై పోలీసుల చిందులు
- ఐడీ కార్డులు చూపించినా పట్టించుకోని వైనం

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : ఫొటోలు..వీడియోలు తీయొద్దు..వెళ్లిపోండి..మీరు మీడియా అయితే ఎన్ని ఫొటోలు తీస్తారంటూ పోలీసులు మీడియాపై చిందులేశారు. చిత్తూరు నగరంలోని కట్టమంచి చెరువు వద్ద ఆదివారం సాయంత్రం నిమజ్జన ప్రక్రియ పండుగ వాతావరణంలో సాగింది. ఈ వేడుకను ఫొటోలు, వీడియోలు తీసేందుకు వెళ్లిన మీడియాకు పోలీసులు ఆంక్షలు విధించారు. మీరు ఏమి ఫొటోలు తీయాల్సిన అవసరం లేదని, ఎన్ని తీస్తారంటూ అడ్డుకున్నారు. మీడియా అయితే ఐడీ కార్డులు చూపించండి అంటూ ఫొటోలు తీయనివ్వలేదు. ఆపై ఐడీ కార్డు చూపించినా ఫొటోలు తీసుకునేందుకు ఏమాత్రం ఒప్పుకోలేదు. ఇది గమనించిన ఓ పోలీసు ఉన్నతాధికారి కల్పించుకుని అడ్డుకున్న సిబ్బందిని అక్కడి నుంచి పంపించేశారు. తరువాత ఫొటోలు తీసుకునేందుకు అవకాశం కల్పించారు.

బాధితులకు అండగా నిలబడుతాం

- న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం
- దళితులపై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేయాలి
- మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : అగ్రవర్ణాలకు చెందిన కూటమి నాయకుల దాడుల్లో గాయపడిన వారికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. మండల కేంద్రంలోని ఎర్రకొంటపై దళితుల కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వారిపై కూటమికి చెందిన వ్యక్తులు దాడులకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ.. ఇంటి స్థలం లేని నిరుపేద దళితులు ఎర్రకొంటపై స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారన్నారు. చర్చి ఉంటున్న స్థలంలోనే తమకు శ్మశానం కావాలంటూ అగ్రవర్ణాలకు చెందిన కూటమి నాయకులు దళితుల ఇళ్లపై దాడులు చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. కూటమి ప్రభుత్వంలో ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ, బీసీ వర్గాలు చెందిన వారికి రక్షణ కరువైందన్నారు. దళితులపై దాడులు చేసిన వారిపై పోలీసులు ఇంత వరకూ ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. దళితులకు న్యాయం చేసే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు.


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

దళితుల భూమిలో పరిశ్రమలా : మండలంలోని పాతపాళ్యం దళితవాడకు చెందిన కొంత మంది వ్యక్తులకు రాష్ట్ర ప్రభుత్వం 56 కానికపురం రెవెన్యూలో తాను సమితి అధ్యక్షుడిగా ఉన్న సమయం నుంచి నేటి వరకు దాదాపు 50 వేల ఎకరాలు అర్హులైన వారికి డీకేటీ పట్టాలు మంజూరు చేశామన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అక్కడ పరిశ్రమలు నెలకొల్పాలని వారి భూములను బలవంతంగా తీసుకోవడానికి ప్రయత్నించడం దారుణమన్నారు. దళితుల భూములకు ఆనుకొని వందల ఎకరాలు ఉన్న కమ్మ సామాజిక వర్గానికి చెందిన భూములును తీసుకోవాలన్నారు. బలవంతంగా భూములు తీసుకుంటే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు మణి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కాలప్ప, ఉమ్మడి జిల్లా క్రియాశీలక కార్యదర్శి కుప్పయ్య, ఎంపీపీ సరిత జనార్దన్, స్థానిక సర్పంచ్ హరిత, మణి, శ్యామ్ పాల్గొన్నారు.

దళితులపై దాడులు చేస్తే ప్రశ్నించరా..?

కూటమి ప్రభుత్వంలో ఉన్నత స్థానంలో ఉన్న ఎమ్మెల్యే, మంత్రులు, ఎమ్మెల్సీ, ఎంపీలు వివిధ రంగాల్లో ప్రజా ప్రతినిధులుగా ఉన్నా దళితులపై దాడులు చేస్తుంటే ఎందుకు ప్రశ్నించడం లేదని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. గెలవడానికి దళితులు ఓట్లు కావాలి, కానీ దళితులు అభివృద్ధి చెందకూడదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలోనే ఎక్కువగా దళితులపై దాడులు జరుగుతున్నాయని నారాయణస్వామి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడులపై (జాతీయ, రాష్ట్ర) ఎస్సీ , ఎస్టీ కమిషన్, జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ఈ కేసును సుమోటాగా స్వీకరించాలన్నారు.

అయ్యో..వినాయకా!

- గణేష్ నిమజ్జనంలో అపశ్రుతి
- చెరువులో మునిగి ఇద్దరు యువకులు మృతి
- చిన్నమనాయనిపల్లిలో తీవ్ర విషాదం


చరణ్ మృతదేహం


భార్గవ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

గంగవరం: కోలాహలం మధ్య గణేష్ నిమజ్జనాన్ని పూర్తిచేశారు. డప్పు వాయిద్యాల నడుమ చిందులేస్తూ చెరువు వద్దకు విగ్రహాన్ని తీసుకెళ్లారు. విగ్రహాన్ని నిమజ్జనం చేసి తిరిగి సంతోషంగా ఇంటికెళ్లారు. తీరా గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు కనిపించకపోవడంతో మళ్లీ చెరువు వద్దకు వచ్చి వెతుకులాట ప్రారంభించారు. విగ్రహం కింద పడి ఆ ఇద్దరూ ప్రాణాలొదలడం చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. అయ్యో.. వినాయకా! కాపాడలేకపోయావా నాయనా..? అంటూ గుండెలు బాదుకుంటూ రోదించడం అక్కడి వారిని కలచివేసింది. ఈ ఘటన గంగవరం మండలం, చిన్నమనాయనిపల్లిలో ఆదివారం రాత్రి తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. వివరాలు.. మండలంలోని మేలుమాయి పంచాయతీ, చిన్నమనాయనిపల్లి గ్రామంలో కొలువుదీర్చిన వినాయకుడిని నిమజ్జనం చేసేందుకు ఆదివారం సాయంత్రం గ్రామ సమీపంలోని చెరువు వద్దకు చేరుకున్నారు. అప్పటికే రాత్రి పడింది. అక్కడ నిమజ్జనం కోసం కొందరు విగ్రహాన్ని చెరువులోకి తీసుకెళ్లారు. వారిలో అదే గ్రామానికి చెందిన బుజ్జమ్మ కుమారుడు భార్గవ్(28), సాలప్ప కొడుకు చరణ్(27) కూడా ఉన్నారు. నిమజ్జనం అనంతరం అందురూ తమ ఇళ్లకు వెళ్లిపోయారు. అయితే ఆ ఇద్దరు యువకులు ఇళ్లకు రాకపోవడంతో అనుమానం వచ్చి గ్రామస్తులు తిరిగి చెరువు వద్దకు వెళ్లి పరిశీలించారు. నీటిలో మునిగిపోయిన విగ్రహాన్ని తాళ్లు కట్టి పైకి తేల్చారు. విగ్రహం కింది భాగాన భార్గవ్, చరణ్ ఇరుక్కుపోయి ప్రాణాలు కోల్పోవడాన్ని గుర్తించి బోరున విలపించారు. ఆపై మృతదేహాలను నీటి నుంచి వెలికి తీసి ఇళ్లకు చేర్చారు. మృతుడు భార్గవ్ గత ప్రభుత్వంలో గ్రామ వలంటీర్‌గా పనిచేశాడు. ప్రస్తుతం టైల్స్ వేసే పనికి వెళ్తాడు. చరణ్ ఇటుకుల బట్టీలో పని చేస్తున్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 1న కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

పోలీసు గ్రీవెన్స్

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలోని వన్‌టౌన్ పక్కన ఉన్న ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ఇక్కడికి ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడుతామని ఎస్పీ తెలిపారు.

నేటి నుంచి రేషన్ పంపిణీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి రేషన్ పంపిణీ చేయనున్నట్లు డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. మొత్తం 1,339 చౌక దుకాణాల పరిధిలోని 5.40 లక్షల కార్డుదారులకు బియ్యంతో పాటు చక్కెర, కందిపప్పు అందించనున్నారన్నారు. ఇందుకు గాను ప్రభుత్వం జిల్లాకు 8 వేల మెట్రిక్ టన్నుల బియ్యం, 3 వేల మెట్రిక్ టన్నుల చక్కెర వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

పాలక మండలి సభ్యుల దరఖాస్తుల పరిశీలన

చౌడేపల్లె : బోయకొండ ఆలయ పరిపాలనా కార్యాలయంలో సోమవారం ఉదయం 10:30 గంటలకు ఇటీవల పాలక మండలి సభ్యుల పదవి కోసం దరఖాస్తు చేసుకున్న వారి ధ్రువపత్రాలను పరిశీలించనున్నట్లు ఈఓ ఏకాంబరం తెలిపారు. మొత్తం 115 మంది సభ్యులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటు వ్యక్తిగత వివరాలతో కూడిన పత్రాలతో స్వయంగా హాజరు కావాలని కోరారు.

7న బోయకొండ ఆలయం మూసివేత

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయాన్ని చంద్ర గ్రహణం కారణంగా ఈనెల 7న ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు మూత వేస్తున్నట్లు ఆలయ ఈఓ ఏకాంబరం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయాన్ని శుద్ధి చేసి సోమవారం నిత్యకైంకర్యాలతోపాటు అమ్మవారికి గ్రహణ దోష పూజలు నిర్వహించి యథావిధిగా భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు ఈఓ పేర్కొన్నారు.

ఇద్దరు బాలురు అదృశ్యం

యాదమరి : ఇద్దరు బాలురు అదృశ్యమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఈశ్వర్ కథనం మేరకు.. చిత్తూరు మండలం ఎస్ఆర్‌పేట సమీపంలో హరి అనే వ్యక్తి బాతులు మేపేవాడు. అయితే ఇద్దరు బాలురకు హరి సంరక్షకుడిగా ఉండేవాడు. ఆ ఇద్దరు పిల్లలు అతడు చేసే పనుల్లో చేదోడు వాదోడుగా ఉంటూ అతడి వద్దే ఉంటున్నారు. కొద్ది రోజులు క్రితం తమిళనాడు రాష్ట్రం పొన్నై సమీపంలో సంచరిస్తుండగా అక్కడి పోలీసులు వారిరువురిని విచారించి ఎస్ఆర్‌పేట పోలీసులకు అప్పగించారు. వారు విచారించగా హరి అనే వ్యక్తి వద్ద ఉండేవారని తెలుసుకుని ఈనెల 14న సీడబ్ల్యూసీ అధికారంలో యాదమరి మండలం పుల్లయ్యగారిపల్లి వద్ద ఉన్న హోప్ చిల్డ్రన్స్ హోమ్ నందు ఆ ఇద్దరు బాలురను చేర్పించారు. అయితే ఈనెల 28న మధ్యాహ్నం నుంచి కనిపించకపోవడంతో సంస్థ ప్రతినిధులు ఎస్‌ఐకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. చిన్నారులు ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. పిల్లల కనిపించినా ,ఆచూకి తెలిసినా 94409 00684 నంబరుకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ ఈశ్వర్ తెలిపారు.

రూ.3.50 కోట్ల విద్యుత్ బిల్లుల చెల్లింపులు

చిత్తూరు కార్పొరేషన్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఆదివారం విద్యుత్ బిల్లుల వసూళ్ల కేంద్రాలను ఆ శాఖ అధికారులు అందుబాటులో ఉంచారు. దీంతో ఆయా జిల్లాలోని వినియోగదారులు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకుని విద్యుత్ బిల్లులను చెల్లించారు. మొత్తం 11,400 మంది విద్యుత్ బిల్లులు చెల్లించగా రూ.3.50 కోట్లు వచ్చిందని చిత్తూరు, తిరుపతి జిల్లాల విద్యుత్ ఎస్ఈలు నరేంద్రనాథ్, సురేంద్ర నాయుడు వెల్లడించారు.

ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : తమ కళాశాలలో నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి కోరారు. ఈ మేరకు ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెప్టెంబర్ 2న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉద్యోగ మేళాలో ప్రముఖ 11 ఎంఎన్‌సీ కంపెనీలు పాల్గొననున్నట్లు వెల్లడించారు. కనీసం 10వ తరగతి నుంచి డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన అభ్యర్థులు పాల్గొనవచ్చన్నారు. వయస్సు 18 నుంచి 35 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. ఇతర వివరాలకు 8465830771, 9963561755 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

ఎస్‌ఈగా ప్రసన్నకుమార్

చిత్తూరు కార్పొరేషన్ : ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈగా రాయచోటి ఈఈ ప్రసన్నకుమార్ ఉద్యోగోన్నతిపై జిల్లాకు రానున్నారు. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొన్నేళ్లుగా ఈఈ విజయ్‌కుమార్ ఇన్‌చార్జి ఎస్‌ఈగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించి ఆ పోస్టును భర్తీ చేసింది. చిత్తూరు డీఈ శ్రీనివాసులుకు ఈఈగా ఉద్యోగోన్నతి కల్పిస్తు నంద్యాలకు, కార్వేటినగరం డీఈ సతీష్‌కుమార్‌ను రాయచోటి ఈఈగా పదోన్నతి ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

పుంగనూరు: పట్టణానికి చెందిన వివాహిత (20) శుక్రవారం అదృశ్యం కావడంతో భర్త ఫిర్యాదు మేరకు ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు రెండేళ్ల క్రితం వివాహం చేసుకున్న యువతి అదృశ్యం కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిత్తూరులో రెండు మద్యం బార్లకే అనుమతి

చిత్తూరు అర్బన్: నూతన మద్యం బార్ పాలసీలో భాగంగా చిత్తూరులో రెండు ప్రాంతాల్లో మాత్రమే మద్యం బార్లు నడపడానికి అనుమతి ఉందని జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి శ్రీనివాసన్ తెలిపారు. ఆదివారం రాత్రి లైసెన్సు గడువు ముగిసిన నాలుగు మద్యం బార్లను, నగరి, పలమనేరులోని ఒక్కో బారును అధికారులు మూయించారు. సీబీ రోడ్డు, కట్టమంచి రోడ్డులోని రెండు మద్యం బార్లకు మద్యం విక్రయాలు చేయడానికి అనుమతి ఉందని, మిగిలిన నాలుగు బార్లకు లైసెన్సులు ఇవ్వక పోవడంతో వాటిని తెరచి ఉంచడానికి వీల్లేదన్నారు. పలమనేరు, నగరి ప్రాంతాల్లో కూడా బార్‌కు అనుమతి లేదని చెప్పారు.

భూతగాదాల్లో ముగ్గురిపై కేసు

పుంగనూరు: మండలంలోని బోడేవారిపల్లెకు చెందిన హరినాథ్‌పై ఆస్తి విషయమై వారి బంధువులు రాజప్ప, రాధాకృష్ణ, కుమార్ కర్రతో దాడి చేసి గాయపరచడంతో ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు గత నెల 28న హరినాథ్ తన పొలంలో కాలువ తీస్తుండగా వారు ఘర్షణ పడ్డారు. రాజప్ప, కుమారులు కర్రతో దాడి చేయడంతో హరినాథ్ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రియురాలిపై ప్రియుడి దాడి

వడమాలపేట (పుత్తూరు): ప్రేమ వ్యవహారంలో తన మాట వినలేదన్న కోపంతో ఓ యువకుడు తన ప్రియురాలిపై దాడికి పాల్పడిన సంఘటన మండలంలోని శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, నారాయణదాసుతోట గ్రామానికి చెందిన కె.కుమారి అలియాస్ కావ్య(23) రెండేళ్లుగా తిరుపతి కొర్లగుంటకు చెందిన టి.శశికిరణ్‌తో ప్రేమలో ఉంది. అయితే కుమారి ప్రేమ వ్యవహారాన్ని తల్లిదండ్రులు అంగీకరించలేదు. దీంతో కుమారి ప్రియుడిని దూరం పెట్టింది. దీనిపై ఆగ్రహించిన శశికిరణ్ శుక్రవారం రాత్రి కుమారి ఇంటికి వచ్చి ఆమెతో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో ఆగ్రహించిన శశికిరణ్ బీరు బాటిల్‌తో కుమారి తలపై కొట్టాడు. కత్తితో వీపుపై పొడిచి గాయపరిచాడు. కుమారి కేకలు విన్న తండ్రి వచ్చి ఆమెను ఆస్పత్రికి తరలించారు. శశికిరణ్ పరారీలో ఉన్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వడమాలపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌ఎంపీల వైద్యం..ప్రాణాలు పణం

- స్థాయికి మించి వైద్య చికిత్సలు
- క్లినిక్, బెడ్స్ ఏర్పాటు చేసి ట్రీట్‌మెంట్
- విచ్చలవిడిగా యాంటీ బయాటిక్స్ వినియోగం
- తూతూ మంత్రంగా పర్యవేక్షణ



విజయపురం : కొంత మంది ఆర్‌ఎంపీలు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని అంతకు మించి వైద్యం అందించకూడదని నిబంధనలు ఉన్నాయి. అయితే వాటిని ఎవరూ పాటించడం లేదు. వచ్చీరాని వైద్యంతో తెలిసీ తెలియని చికిత్సలతో ప్రాణాలను హరిస్తున్నారు. అన్ని వ్యాధులకు ఒకే మందు అన్నట్లు వచ్చిన ప్రతి బాధితుడికి ఓ రెండు రకాల సూది మందులు, ఎర్ర, పచ్చ, తెల్లది అంటూ మరో మూడు మాత్రలు ఇచ్చేస్తున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా సుమారు 5 వేలు ఆర్‌ఎంపీ క్లినిక్‌లు ఉన్నాయి. ఈ క్లినిక్‌లలో రోగులకు ప్రథమ చికిత్స చేసేందుకే పరిమితం కావాల్సిన ఆర్‌ఎంపీ, పీఎంపీలు తమ పరిధి దాటి వైద్యం చేస్తున్నారు. అర్హత లేకపోయినా క్లినిక్‌లు, బెడ్స్ ఏర్పాటు చేసి ట్రీట్‌మెంట్ చేస్తూ తమ ఇష్టం వచ్చినట్లుగా మందులు వాడుతూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కొందరైతే ల్యాబ్, మెడికల్ షాప్స్ నిర్వహించడమే కాకుండా గుట్టుచప్పుడు కాకుండా అబార్షన్లు చేస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు. వీరి నిర్లక్ష్యంతో ఎక్కడో ఒక చోట బాధితులు ప్రాణాలనే కోల్పోతూనే ఉన్నారు. తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ఆర్‌ఎంపీలు మాత్రం తీరు మార్చుకోవడం లేదు. మరోవైపు తక్కువ ఖర్చులో ఇంటికి సమీపంలో వైద్యసేవలు అందుతాయనే భావనతో ఏ వ్యాధికైనా ఆర్‌ఎంపీలనే సంప్రదిస్తుండటం చివరకు ప్రాణాల మీదకు తెచ్చుకోవడం పరిపాటిగా మారిపోయింది.

ల్యాబ్‌లు, మెడికల్ షాపులు ఏర్పాటు చేసి..

నిబంధనల మేరకు ఆర్‌ఎంపీ, పీఎంపీలు ప్రథమ చికిత్స చేసేందుకే పరిమితం కావాలి. తమ సెంటర్‌లో ప్రథమ చికిత్స కేంద్రం అని బోర్డు మాత్రమే పెట్టుకోవాలి. కానీ చాలామంది ప్రవేటు ఆసుపత్రి తలపించేలా క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అందులో నాలుగైదు బెడ్స్ ఏర్పాటు చేసి, తామే డాక్టర్‌గా చలామణి అవుతూ రోగులకు ట్రీట్‌మెంట్ చేస్తున్నారు. గ్రామాల్లో డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఎక్కువగా ఆర్‌ఎంపీ, పీఎంపీలపైనే ఆధారపడుతున్నారు. ఇదే అదనుగా భావించిన వీరు పసి పిల్లల నుంచి పండు ముసలి వరకు పెయిన్ కిల్లర్స్, యాంటీ బయాటిక్స్, స్టెరాయిడ్స్ ఇస్తున్నారు. వీటి వల్ల ఉన్న రోగం తగ్గకపోగా కొత్తగా రావడం, బీపీ పెరగడం, తగ్గడం, తల తిరగడం, వాంతులు, ఒంటి నొప్పుల వంటి సమస్యలు ఏర్పడుతున్నాయి.

పట్టించుకోని వైద్యాధికారులు

ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఎన్నో ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. నగరి నియోజకవర్గం విజయపురం మండలంలో సుమారు 15కి పైగా ఆర్‌ఎంపీ క్లినిక్‌లు ఉన్నాయి. ఒక పన్నూరు సబ్ స్టేషన్‌లోనే 7కు పైగా ఆర్‌ఎంపీ క్లినిక్‌లు ఉండగా అందులో ఓ ఆర్‌ఎంపీ క్లినిక్ 24 గంటలు జనంతో కిటకిటలాడుతూ ఉంటుంది. అక్కడ బెడ్ ఏర్పాటు చేసి సెలైన్లు పెట్టి ట్రీట్మెంట్ అందిస్తున్నారు. పక్కనే మెడికల్ షాపు ఉంది. రెండు దశాబ్దాలుగా వైద్యం చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

ఈ టైంలో సరైన ట్రీట్మెంట్ అందక ప్రాణాలే గాలిలో కలిసిపోతున్నాయి. మరికొందరు ఎలాంటి అర్హతలు లేకున్నా ల్యాబ్‌లు ఏర్పాటు చేసి అన్ని రకాల టెస్టు, మెడికల్ షాపులు పెట్టి మందులు అమ్ముతూ తమ జేబులు నింపుకుంటున్నారు. కొంతమంది గుట్టుచప్పుడు కాకుండా ఎంపీటీ కిట్లు వాడుతూ అబార్షన్లు సైతం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆర్‌ఎంపీలపై రాష్ట్ర వ్యాప్తంగా పలు కేసులు నమోదైనట్లు మెడికల్ కౌన్సిల్ చెబుతున్నా ఎలాంటి మార్పు కనిపించడం లేదు. ఆర్‌ఎంపీ కేంద్రంపై కేసు నమోదైతే పేరును మార్చి మళ్లీ మరో పేరుతో కేంద్రాన్ని ఏర్పాటు చేసి కొనసాగిస్తున్నారు. వారి పరిధిని దాటి వైద్యం అందించడంతో పాటు శస్త్రచికిత్సలు సైతం చేసేస్తున్నారు.

జరిగిన ఘటనలు మచ్చుకు కొన్ని ఇలా..

- ఇటీవల తమిళనాడు పళ్లిపట్టు సమీపం నివసించే 17 ఏళ్ల వయస్సుగల అమ్మాయి గర్భం దాల్చగా విజయపురం మండలం పన్నూరులో ఓ ఆర్‌ఎంపీ వద్దకు వెళ్లగా అబార్షన్ చేశారు. కొన్నాళ్లకే ఆమె ఆరోగ్యం క్షీణించడంతో ఆస్పత్రికి తీసుకెళ్లే మార్గంలో మృతి చెందింది. సంబంధిత ఆర్‌ఎంపీపై పళ్లిపట్టు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.
- గతంలో నగరి మండలంలో గర్భస్రావం కోసం ఒక యువతి ఆర్‌ఎంపీని సంప్రదించింది. ఆ సమయంలో గర్భస్రావం చేయకూడదని తెలిసినా ఆర్‌ఎంపీ సూది మందు ఇవ్వడంతో అది వికటించింది. ఆపై ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినా ప్రాణాలు దక్కలేదు. ఆర్‌ఎంపీ నిర్లక్ష్యంతో నూరేళ్ల జీవితం అర్ధాంతరంగా ముగిసిపోయింది.

ఆలకుప్పంలో పచ్చమూకల పైశాచికం



యూత్ అధ్యక్షుడి ఇంటిపైకి టపాసులు విసిరిన పచ్చమూక

గంగవరం : మండలంలోని ఆలకుప్పంలో కూటమి దౌర్జన్యాలు పెచ్చుమీరుతున్నాయి. వైఎస్సార్‌సీపీ నాయకులను టార్గెట్ చేస్తూ రోజుకో రకంగా చిత్రహింసలకు దిగుతున్నారు. మొన్నటి రోజున బీసీ మహిళా అధ్యక్షురాలు కవిత కుటుంబీకులపై దాడులకు తెగబడ్డారు. మరుసటి రోజున ఇదే గ్రామంలోని వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు కిషోర్‌నాయుడు ఇంటిపైకి టపాసులు విసరడం ఆటవిక చర్యగా భావిస్తున్నారు. అదేవిధంగా రాత్రి సమయంలో వినాయకస్వామి జల్ది కార్యక్రమాలు చేపట్టరాదని పోలీసులు ఆంక్షలు ఉన్నా అవేవీ టీడీపీ నాయకులు పట్టించుకోవడం లేదు. అయితే వైఎస్సార్‌సీపీ వర్గీయులు ఏర్పాటు చేసుకున్న దేవుడి మండపాల వద్ద భక్తి పాటలు పెడితే వెంటనే పోలీసులను పంపి ఆపించడం లేదా ఆంప్లిఫైర్ లాక్కొని వెళ్లడం జరుగుతోంది. ఒకవేళ తమ ఆంక్షలు పోలీసులు వినకపోతే వెంటనే ఎమ్మెల్యే దగ్గర నుంచి ఫోన్లు చేయించి మరీ పోలీసులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపిస్తున్నారు. మండలంలో ఎక్కడా లేని విధంగా ఈ గ్రామంలో మాత్రం టీడీపీ అరాచకాలు మితిమీరిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాచిగుంటలో రేషన్ పంపిణీ జరిగేనా?



కలెక్టరుకు ఫిర్యాదు చేయదానికి సిద్ధమవుతున్న బాధిత డీలర్

యాదమరి : అనారోగ్య సమస్యలతో వైద్య చికిత్స కోసం వెళ్లి స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి హాజరు కాలేని ఓ రేషన్ డీలర్‌పై కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గి రెవెన్యూ అధికారులు ఈ–పాస్ యంత్రాన్ని స్వాధీనం చేసుకున్న సంఘటన మండలలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని పాచిగుంట గ్రామంలో శనివారం రెవెన్యూ అధికారులు స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అయితే సదరు డీలర్ అయిన పెరుమాళ్ చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాడు. దీంతో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం బోదగుట్టపల్లి పంచాయతీ కొలనంపల్లిలో ప్రారంభించారు. అయితే సదరు డీలరు వైఎస్సార్‌సీపీకి సానుభూతి పరుడు కావడంతో కూటమి నేతల పక్కా ప్రణాళికతో రెవెన్యూ అధికారులతో కుయుక్తులు పన్నారు. అందులో భాగంగానే కార్డుల పంపిణీకి సదరు డీలర్‌కు చెందిన ఈ–పాస్ యంత్రాన్ని ఆయన కుటుంబ సభ్యుల నుంచి తీసుకెళ్లారు. ఈ విషయంపై తహసీల్దార్ పార్థసారథిని ప్రశ్నించగా..ఆర్డీఓ ఆదేశాల మేరకు యంత్రాన్ని ఇవ్వలేదని చెప్పారు. అనారోగ్య సమస్యల కారణంగానే స్మార్ట్ కార్డుల కార్యక్రమానికి తాను హాజరు కాలేకపోయానని సంజాయిషీ చెప్పినా తహసీల్దార్ వినలేదని బాధిత డీలర్ ఆరోపించారు. కేవలం కూటమి నేతల ప్రోద్భలం, ఒత్తిళ్లతోనే కక్ష కట్టి తన డీలర్‌షిప్‌ను రద్దు చేసేందుకు కుట్ర పన్నుతున్నారని డీలర్ పెరుమాళ్ విమర్శించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు బాధిత డీలర్ చెప్పారు. కాగా పాచిగుంటలో నేడు జరగాల్సిన రేషన్ సరఫరా అవుతుందో లేదో అన్న సందిగ్ధం నెలకొంది. ఈ విషయంపై తహసీల్దార్ పార్థసారథిని వివరణ కోరగా రేషన్ డీలర్ కేవలం ఉద్దేశపూర్వకంగానే పంపిణీకి గైర్హాజరయ్యాడని చెప్పాడు. ఆర్డీఓ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని చెప్పారు. పాచిగుంటలో యథావిధిగా లబ్ధిదారులకు నిత్యావసరాలు పంపిణీ కొనసాగుతుందని చెప్పారు.

జానపద కళలను కాపాడుకుందాం



ముగింపు కార్యక్రమంలో గాయకులను సత్కరించిన సంఘ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్ : పల్లె ప్రజలు నవజీవన చైతన్యానికి ప్రతి రూపాలని మన సంస్కృతి కళా సంస్థ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు సహదేవ నాయుడు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని విజయం విద్యాసంస్థల్లో ఆ సంఘం కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న జానపద మాసోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 1వ తేదీ నుంచి జానపద మాసోత్సవాలను ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. నేటి తరం విద్యార్థులకు జానపద కళల గొప్పదనం వివరించినట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రచయిత్రి అరుణకుమారి మాట్లాడుతూ.. పల్లె పదాలు, జానపద కళలు, పాటలు, పల్లె ప్రజల శ్రమ గొప్పదన్నారు. తోలుబొమ్మలాటలు, చెక్కభజనలు, ఒగ్గు కథలు, హరికథలు, వీధి నాటకాలను ప్రదర్శించి వినోదం కల్పించేవారన్నారు. జానపద కళలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందన్నారు. అనంతరం పలువురు గాయకులను సత్కరించారు. ముగింపు కార్యక్రమంలో ఆ సంఘం కార్యదర్శి కలకట రెడ్డెప్ప, గాయకులు శ్రీరంజని, లత, నరసింహులు, అనంత్‌కుమార్, చిరంజీవి, మనోహర్ పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ల ఆటకట్టు

- ఇద్దరు నిందితుల అరెస్టు
- రూ.33 లక్షలకు పైగా ఆభరణాలు, నగదు సీజ్
- మీడియా సమావేశంలో ఎస్పీ మణికంఠ



నిందితులను అరెస్టు చూపించి, వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మణికంఠ, స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలో వరుస చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డ ఇద్దరు నిందితులను పోలీసులు పట్టుకున్నారు. నిందితులు అంసాయూసన్ (26), మహ్మద్ పితా (25) అనే ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు.. దాదాపు రూ.23 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం చిత్తూరులోని పోలీసు అతిథి గృహంలో ఎస్పీ మణికంఠ మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు.

- చిత్తూరులోని పలు ప్రాంతాల్లో రెండు నెలలుగా గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనాల్లో వచ్చి ఒంటరి మహిళలనే లక్ష్యంగా చేసుకుని చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డారు. బాధిత మహిళలు ఇచ్చిన ఫిర్యాదుపై వన్‌టౌన్ పోలీసులు దీనిపై కేసులు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. నగరంలోని చామంతిపురం వద్ద ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వెళుతూ పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరినీ విచారించగా నిందితులు తమిళనాడు మేటుపాళ్యంకు చెందిన అంసాయూసన్, దిండికల్‌కు చెందిన మహ్మద్ పితాగా గుర్తించారు. చైన్‌స్నాచింగ్‌కు పాల్పడింది తామేనంటూ నిందితులు పోలీసుల ఎదుట అంగీకరించారు. చిత్తూరుతో పాటు పుంగనూరు, వి.కోటతో కలిపి వీళ్లపై ఏడు కేసులు నమోదయ్యాయి. నిందితులను అరెస్టుచేసి రూ.20 లక్షల విలువైన 192 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.3 లక్షల విలువ చేసే రెండు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- తాళం వేసిన ఇళ్లలోకి చొరబడి చోరీలకు పాల్పడే తమిళనాడుకు చెందిన జి.ప్రశాంత్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. గతనెల 21వ తేదీన చిత్తూరు మండలంలోని బంగారెడ్డిపల్లెలో మునిరాజ అనే వ్యక్తి పనులకు వెళ్లి, సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి గుర్తుతెలియని వ్యక్తి ఇంటి తాళం పగులగొట్టారు. లోపలికి వెళ్లి చూడగా రూ.42 వేల నగదు, 65 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఎస్ఆర్.పేట చెక్‌పోస్టు వద్ద ప్రశాంత్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. గతేడాది పెనుమూరులోని 34 గ్రాముల బంగారు ఆభరణాలు, ఈ ఏడాది తాలూక పోలీస్ స్టేషన్ పరిధిలో మరో ఇంట్లో 10 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటనల్లో సైతం ఇతనే నిందితుడిగా గుర్తించారు. నిందితుడి నుంచి రూ.10.35 లక్షల విలువ చేసే 109 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.42 వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా రెండు కేసుల్లో నిందితులను పట్టుకోవడంతో ప్రతిభ చూపించిన అధికారులు, సిబ్బందిని అభినందిస్తూ ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, సీఐలు మహేశ్వర, నిత్యబాబు, ఉమామహేశ్వర్, ఎస్ఐలు మల్లికార్జున, నాగసౌజన్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాప్రతిభా అవార్డు స్వీకరణ



డీవైఈఓ చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న పీడీ రవీంద్రారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని చిత్తూరు రూరల్ మండలం, సిద్ధంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు క్రీడా ప్రతిభా అవార్డు లభించింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో జిల్లా స్థాయిలో క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్న పలు పాఠశాలలకు స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో భాగంగా క్రీడా ప్రతిభా అవార్డును అందజేశారు. 120 మంది విద్యార్థులు ఉన్న సిద్ధంపల్లి పాఠశాల 115 క్రీడా పాయింట్లతో అవార్డుకు ఎంపికైంది. ఈ అవార్డును ఆ పాఠశాల పీడీ రవీంద్రారెడ్డి జిల్లా స్థాయిలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో డీవైఈవో ఇందిరా చేతుల మీదుగా అందుకున్నారు. ఎంఈవోలు హసన్‌బాషా, సెల్వ పాండ్యన్, హెచ్‌ఎం సురేష్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ దుర్మరణం



అరీఫా (ఫైల్)

యాదమరి: ఇంట్లోని నీటి మోటారు వేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి ఓ మహిళ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ ఈశ్వర్ వివరాల మేరకు మండల పరిధిలోని నూర్ ఈ నగర్ ప్రాంతానికి చెందిన కలందర్ భార్య ఎస్.అరీఫా(40) ఆదివారం ఉదయం తమ గృహంలో నీటి కోసం మోటారు స్విచ్ వేయగా విద్యుత్ షాక్ తగిలి కింద పడిపోయింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వైద్యం నిమిత్తం చిత్తూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అక్కడ విధులు నిర్వర్తిస్తున్న వైద్యులు ఆమెను పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ ఈశ్వర్ తెలిపారు.

అండర్ బ్రిడ్జి నిర్మించాలని శవంతో ధర్నా

– అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని మండిపాటు



రొంపిచెర్ల క్రాస్ సమీపంలోని నేషనల్ హైవేలో ధర్నా చేస్తున్న ప్రజలు

రొంపిచెర్ల : రొంపిచెర్ల క్రాస్ వద్ద హైవేలో అండర్ బ్రిడ్జి నిర్మించాలంటూ గ్రామస్తులు మృతదేహంతో ధర్నా నిర్వహించిన ఘటన స్థానికంగా సంచలనం కలిగించింది. ఆదివారం నేషనల్ హైవేలో శనివారం రాత్రి మృతి చెందిన కూలీ జయచంద్ర మృతదేహంతో రోడ్డుకు అడ్డంగా ఆటోలు పెట్టి ధర్నాకు దిగారు. బెంగుళూరు–తిరుపతి జాతీయ రహదారిలోని రొంపిచెర్ల క్రాస్ రోడ్డు వద్ద అండర్ బ్రిడ్జి లేకపోవడంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్డు దాటుతూ ప్రమాదాలకు గురై పలువురు మృతి చెందారన్నారు. ఇక్కడ అండర్ బ్రిడ్జి నిర్మించాలని హైవే అధికారులు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. శనివారం రాత్రి కూడా కూలీ జయచంద్ర రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని మృతి చెందారని తెలిపారు. నిత్యం ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఇక్కడ అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలని కోరారు. హైవేలో ధర్నా చేయడంతో భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోవడంతో రొంపిచెర్ల ఎస్ఐ సుబ్బారెడ్డి నేషనల్ హైవేలో ధర్నాలు చేయరాదని , ఏదైనా సమస్య ఉంటే కాంట్రాక్టర్‌తో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ప్రజలు ధర్నాను విరమించారు. అయితే సమస్య పరిష్కారం కాకపోతే మళ్లీ ధర్నా చేస్తామని ప్రజలు హెచ్చరించారు.

హంద్రీనీవా కాలువలో పడి యువకుడి మృతి



చంద్రశేఖర్ (ఫైల్)

బైరెడ్డిపల్లె : మండలం మీదుగా కుప్పానికి వెళ్తున్న హంద్రీనీవా కాలువలో యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం తావడకుప్పం గ్రామం వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు... తావడకుప్పం గ్రామానికి చెందిన రామక్రిష్ణప్ప కుమారుడు చంద్రశేఖర్(26) ఆదివారం సాయంత్రం గ్రామ సమీపంలో ఉన్న హంద్రీ నీవా కాలువలో ప్రమాదవశాత్తు కాలు జారి పడ్డాడు. చంద్రశేఖర్‌కు ఈత రాకపోవడంతో కాలువలో మునిగితేలుతుండటంతో రైతులు గమనించి చంద్రశేఖర్‌ను గట్టుకు చేర్చి బైరెడ్డిపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందాడు. రామక్రిష్ణప్పకు ఒక్కడే కుమారుడు కావడంతో గ్రామంలో విషాదం అలుముకున్నాయి.

చేపలు పట్టేందుకు వెళ్లి తిరిగిరాని లోకాలకు



మృతి చెందిన సురేష్

బంగారుపాళెం: చేపలు పట్టేందుకు వెళ్లి చెరువులో మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలోని మొగిలి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మొగిలి పంచాయతీ పరిధిలోని మొగిలి మిట్టూరుకు చెందిన సురేష్(40) స్నేహితులతో కలసి మొగిలి సమీపంలోని గొనిచెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు సురేష్ చెరువులో పడి మునిగిపోయాడు. సహచరులు గుర్తించి చెరువులో మునిగిన సురేష్‌ను బయటకు తీశారు. అప్పటికే సురేష్ మృతి చెందాడు.

మిద్దెపై నుంచి వినాయకున్ని చూస్తూ...

– కరెంట్ షాక్‌కు గురైన బాలుడు

పలమనేరు: పట్టణంలోని ఇంటి ముందున్న వీధిలో వినాయకుడి నిమజ్జనాన్ని చూసేందుకు మిద్దెపైకెళ్లి ప్రమాదవశాత్తు లెవన్‌కేవీ కరెంట్ లైన్లను తాకి ఓ బాలుడు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం పలమనేరు పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలు.. స్థానిక డీఎస్పీ వీధిలో నివాసముంటున్న వాజిద్ కుమారుడు ముస్తకీం(08) ఇంటిముందు వీధిలో వెళుతున్న వినాయకున్ని చూసేందుకు మిద్దెపైకెక్కాడు. అక్కడ పైనున్న హైటెన్షన్ వైర్లను చే తితో తాకడంతో షాక్‌కు గురయ్యాడు. చికిత్స నిమిత్తం బాలుడిని స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లగా.. వైద్యులు పెద్దాస్పత్రికి వెళ్లాలని రెఫర్ చేశారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. చిత్తూరు నగర పరిధిలోని తిమ్మసముద్రానికి చెందిన గోపీనాథ్ (33) శనివారం రాత్రి కాణిపాకంలో జరిగిన బంధువుల పెళ్లికి వెళ్లాడు. అక్కడి నుంచి భార్యను పుట్టింటికి పంపాడు. ఆదివారం ఇంటికి చేరుకున్న గోపీనాథ్ పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు అతన్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

పలమనేరులో టీడీపీ నేత ఇంట్లో భారీ చోరీ

– రూ.70 లక్షల విలువ చేసే బంగారు నగల అపహరణ




ఇంట్లో చిందర వందరగా వస్తువులు

పలమనేరు: పలమనేరు పట్టణంలోని రాధా బంగ్లాలో నివాసముంటున్న టీడీపీ నాయకుడు సాకేవూరు రామ్మూర్తి నాయుడి ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఈ విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. రామూర్తి నాయుడు దంపతులు శుక్రవారం బెంగుళూరులోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంట్లో వారి కుమార్తె సౌజన్యను ఉంచారు. ఇలా ఉండగా శనివారం స్వగ్రామమైన సాకేవూరుకు సౌజన్య వెళ్ళింది. దీన్ని గమనించిన దొంగలు ఇంటి వెనుకవైపునుంచి కిటికీలను తొలగించి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని దాదాపు రూ.70లక్షలు విలువైన బంగారు నగలను చోరీ చేశారు. అయితే అక్కడున్న వెండి నగలను వారు ముట్టుకోలేదు. ఆదివారం మధ్యాహ్నం ఈ విషయాన్ని గమనించిన కుటుంబీకులు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ డేరంగుల ప్రభాకర్ తన సిబ్బందితో కలసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇంటి వద్ద కనీసం సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేయకపోవడంపై మండిపడ్డారు. ఇంట్లో లేని సమయంలో పోలీసులకు సమాచారం ఇచ్చి వెళ్లాలనే విషయం తెలియకుంటే ఎలా అని బాధితుల్ని ప్రశ్నించారు. కాగా గత నెల 17న పట్టణంలో టీడీపీ సీనియర్ నాయకులు ఆర్వీ బాలాజీ కుటుంబంలో ఇదే తరహాలో బంగారు నగలను చోరీ చేశారు. ఈ రెండు చోరీలు ఒకేరీతిలో జరగడం గమనార్హం. గత కొన్నాళ్లుగా కేవలం టీడీపీలోని బడా నేతల ఇళ్లపైనే దొంగలు పడడం పట్టణంలో సంచలనం సృష్టిస్తోంది. ఇంట్లో ఉండమని చెప్పిన రామ్మూర్తి నాయుడి కుమార్తె స్వగ్రామానికి వెళ్లడంతో ఆ విషయం తెలుసుకున్న వారే ఈ చోరీకి పాల్పడినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.

గంగమ్మా..దీవించమ్మా

– కిక్కిరిసిన బోయకొండ



ఆలయంలో భక్తుల రద్దీ

చౌడేపల్లె : పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. కోరిన కోర్కెలు తీర్చే గంగమ్మా.. కోర్కెలు తీర్చి మమ్మల్ని ఆశీర్వదించమ్మా అంటూ భక్తులు పూజలు చేశారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేల మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ వాహనాల్లో తరలి వచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు ఉపవాస దీక్షలతో ఆలయం వద్దకు చేరుకొని గంగమ్మకు పూజలు చేశారు. అధిక సంఖ్యలో దర్శన కోసం భక్తులు తరలిరావడంతో క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. కోరిన కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనెదీపాలు, దీవెలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు.